


# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శనివారం 25-07-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 109 రూ॥ 6.00





# మిల్లర్లు..దళారుల, రేషన్ బియ్యం దందా!




## అటుకొనండ్రి..ఇటు అమ్ముండ్రి!

## రాష్ట్ర ప్రభుత్వానికి మిల్లర్ల శఠగోపం








No. 3(11)/2026-Py.I (389486)
Government of India
Ministry of Consumer Affairs, Food and Public Distribution
Department of Food and Public Distribution

Krishi Bhawan, New Delhi.
Dated 22-07-2026

To,
The Principal Secretary to Government,
Consumer Affairs, Food & Civil Supplies Department,
Government of Telangana,
Civil Supplies Bhawan, Errmanjil, Somajiguda,
Hyderabad - 500 082.

Subject: Enhancement of Paddy procurement estimates for Telangana during KMS 2025-26 (Rabi crop) - reg.

Sir,

I am directed to refer to D.O. letter No. Pl(1)/122/2026 dated 21.06.2026 of Hon'ble Minister, Food & Civil Supplies, Telangana on the subject mentioned above and to convey the approval of the Government of India for enhancement of paddy procurement estimates (in terms of rice) for Telangana for KMS 2025-26 (Rabi Crop) by 08 LMT. Accordingly, the revised paddy procurement estimates for Telangana for KMS 2025-26 (Rabi) is 43.00 LMT (in terms of rice).

2. Besides, Govt. of Telangana should ensure complete implementation of Vehicle Location Tracking System (VLTS) across the State, by 30th September, 2026 positively.

3. This issues with the approval of Hon'ble Minister of Consumer Affairs, Food & Public Distribution.

Digitally signed by
Deependra Singh
Date: 22-07-2026
12:39:01
(Deependra Singh)
Under Secretary to the Govt. of India
Email: uspy1.fpd@nic.in

Copy for information to:

1. Chairman and Managing Director, FCI, New Delhi
2. Executive Director (Procurement), FCI HQ, New Delhi
3. Executive Director (South Zone), FCI
4. General Manager, Telangana Region, FCI
5. General Manager (Procurement/P&R), FCI HQ, New Delhi




- అక్రమ మిల్లర్ల మీద అధికారులే ఈగ వాలనివ్వరు.
- ప్రభుత్వం దృష్టి పెడితే అక్రమ మిల్లర్ల బండారం మొత్తం బైట పడుతుంది.
- అధికారుల అక్రమ వాటాలు కూడా వెలుగు చూస్తాయి.
- రాష్ట్రంలో వున్న 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనేందుకు కేంద్రం ఆమోదం.
- ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ కేంద్రం ఇవ్వనుంది.
- తెలంగాణ లో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తోంది.
- అటు ప్రజలకు బియ్యం అందగానే కొనేందుకు దళారులు సిద్ధం.
- దళారులు తెచ్చే బియ్యం అమ్ముకున్న బియ్యం స్థానం లో అప్పగించేందుకు మిల్లర్ల వ్యూహం.
- అవసరమైతే రేషన్ బియ్యానికి పాలిష్ పట్టి ఇవ్వాలని మిల్లర్ల నిర్ణయం.
- అటు తిరిగి ఇటు తిరిగి అక్రమ మిలర్లకే లాభం.
- ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలన్నీ మిల్లర్లకు వరంగా మారుతున్న వైనం.

- దళారులకు అక్రమ మిల్లర్ల బంపర్ ఆఫర్!
- ఈ సారి రెండు రూపాయలు అదనంగా ఇస్తాం తీసుకురండి!
- దళారులు కొంటారు.. మిల్లర్లకు అమ్ముతారు!
- పేదలకిచ్చిన రేషన్ బియ్యం కొనండి.. తెచ్చి మాకు అమ్మండి!
- మిల్లర్లు.. దళారుల మధ్య కొత్తగా కుదిరిన ఒప్పందం!
- వచ్చే నెల కేంద్రం మరోసారి మూడు నెలల రేషన్ బియ్యం సరఫరా.
- తెలంగాణ నుంచి అదనంగా బియ్యం కోనేందుకు అంగీకారం!
- అక్రమ మిల్లర్లకు వరం.. వందల కోట్లు మింగేందుకు మార్గం!
- డిఫాల్టర్లు మిల్లర్లు తప్పించుకునే అవకాశం.
- ప్రభుత్వం ఇచ్చిన వడ్లను అక్రమ మిల్లర్లు ఎప్పుడో మింగేశారు.
- బియ్యం చేసి అమ్ముకున్నారు. గోదాములు ఖాళీ చేశారు.
- ఇప్పటికిప్పుడు రాష్ట్ర ప్రభుత్వం బియ్యం పెట్టమంటే అక్రమ మిల్లర్లు దొరికిపోతారు.
- కానీ ఆ పని అధికారులు చెయ్యరు.

హైదరాబాద్, నేటిధాత్రి:

శత కోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలని పెద్దలు ఊరికే చెప్పలేదు. ఇప్పుడు సరిగ్గా అదే జరుగుతోంది. ముందు దాని పూర్వాపరాలు తెలుసుకుందాం. ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనార్థం మూడు నెలల రేషన్ ఒకే సారి అందిస్తోంది. ఇలా ఈ మధ్య వరుసగా సాగుతోంది. ఈసారి కూడా మళ్లీ వచ్చే నెలలో మూడు నెలల రేషన్ బియ్యం ఒకే సారి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది. ఇది ప్రజలకు ఎంత వరకు ఉపయోపడుతుందో గాని, మిల్లర్లకు మాత్రం బాగా ఉపయోగపడుతోంది. ఒక్క తెలంగాణలోనే కాదు, దేశ వ్యాప్తంగా మిల్లర్లకు ఇది వరంగా మారింది. అలాగే తెలంగాణ మిల్లర్లకు మాత్రం మరింత వరమైపోయింది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న బియ్యాన్ని కేంద్రం కొనుగోలు చేసేందుకు ఎక్కే మైటు, దిగే మైటు అన్నట్లు వెళ్లి, కేంద్ర పెద్దలను బ్రతిమిలాడుకుంటున్నారు. రికార్డు స్థాయిలో వడ్లు పండుతున్నాయి. ఆ వడ్లను కొనుగోలు చేసి,రైతులను కాపాడుకుంటున్నాం. ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులు అన్యాయమైపోతారని కేంద్రాన్ని ఒప్పించి, మెప్పించి, పదే పదే డిల్లీకి వెళ్లి బ్రతిమిలాడుకుంటున్నారు. అందుకు కోసం మంత్రులు పడుతున్న ప్రయాస అంతా ఇంతా కాదు. సిఎం. రేవంత్ రెడ్డితో సహా, మంత్రులు ఎప్పుడు డిల్లీ వెళ్లినా, కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరుతూ వస్తున్నారు. ఆఖరుకు ఇటీవల మరో 8లక్షల మెట్రిక్ టన్నుల బియ్యన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ప్రభుత్వం ఎంతో కష్టపడి చేసినీ ప్రయత్నం తెలంగాణలోని మిల్లర్లకు వరంగా మారింది. తెలంగాణలో గత సీజన్‌లలో ప్రభుత్వం ఇచ్చిన వడ్లను చాలా మంది మిల్లర్లు బియ్యం చేసింది లేదు. ప్రభుత్వానికి ఇచ్చింది లేదు. కాని అందులో కొంత మంది మిల్లర్లు ఆ వడ్లను బియ్యం చేసుకొని భహిరంగ మార్కెట్లో అమ్ముకున్నారు. ప్రభుత్వం అడిగినప్పుడు చూద్దాం...లేకుంటే ఎప్పటిలాగా ఎగేవేద్దామనుకున్నారు. ఇప్పటి వరకు వున్న బకాయిలకు మరిన్ని తోడౌతాయి? అంతే అని అనుకున్నారు. తెలంగాణలో పండుతున్న రికార్డు స్థాయి వడ్లను మిల్లర్లకు ఇవ్వకుండా వుండలేరు. అందులోనూ మిల్లర్ల నాయకుల మిల్లర్లకు వడ్లు కేటాయించకుండా అసలే వుండలేరు. అందువల్ల ఎప్పటికప్పుడు వడ్డు బకాయి మిల్లర్లకు కేటాయిస్తూనే వున్నారు. అయితే కేంద్రం ఇచ్చిన హమీతో మిల్లర్ల దగ్గర వున్న బియ్యం కేంద్రానికి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దమైమౌతోంది. కాని కొంత మంది అక్రమ మిల్లర్ల వద్ద వడ్ల గించలేదు. బియ్యం సంచి లేదు. ఇదే సమయంలో కేంద్రం మూడు నెలల రేషన్ ఒకే సారి అనే ప్రకటన వారికి వరంగా మారనున్నది. ఈ ప్రకటన ఇలా వచ్చిందో లేదో..అక్రమ మిల్లర్లు వెంటనే దళారులను పిలిపించుకున్నారు. ఎందుకంటే రేషన్ బియ్యం సేకరించి, మిల్లర్లకు సప్లై చేసే దళారీ వ్యవస్థ తెలంగాణలో పాతుకుపోయింది. అందులోనూ సన్న బియ్యం ఇస్తున్నప్పటి నుంచి ఆ వ్యవస్థ మరింత పెరిగిపోయింది. మిల్లర్లకు ఎంత బియ్యం అంటే అంత సరఫరా చేసేంత శక్తిగా దళారీ వ్యవస్థ ఎదిగిపోయింది. ప్రభుత్వం ఎంత సన్న బియ్యం ఇస్తున్నా, చాలా మంది బియ్యాన్ని తీసుకోరు. అయితే డీలర్లకే అమ్ముకుంటున్నారు. లేకుంటే ఇంటికి వచ్చే దళారులకు అమ్ముకుంటున్నారు. అలా అటు డీలర్ల నుంచి, ఇటు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసే వ్యవస్థ వేళ్లూనుకుపోయింది. ఒక రకంగా అటు మిల్లర్లతోపాటు, దళారులు సమాంతర వ్యవస్థ నడిపిస్తున్నారు. మిల్లర్లను ఆదుకుంటున్నారు. ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని నిండా ముంచేస్తున్నారు. గతం కన్నా ఈసారి కిలోకి రెండు రూపాయలు ఎక్కువైనా సరే రేషన్ బియ్యం సరఫరా చేయాలని దళారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటు వచ్చే నెల ఒకటో తారీఖు నుంచి ఇచ్చే రేషన్ బియ్యాన్ని ఎక్కడికక్కడ కొనుగోలు చేసి,మిల్లర్లకు సరఫరా చేసేందుకు సిద్దమౌతున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇచ్చేందుకు సిద్దమైన బియ్యం అనేక మంది డిపాల్ట్ మిల్లర్లు సరఫరా చేయాల్సి వుంటుంది. అందుకోసం రేషన్ బియ్యం సేకరించి, వాటిని మరో సారి పాలిష్ చేసి ప్రభుత్వానికి ఇచ్చేందుకు అన్ని సిద్దం చేసుకుంటున్నారు. అంటే ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్నే తిరిగి ప్రభుత్వానికి ఇచ్చి చేతులు దులుపుకుందామని చూస్తున్నారు. ఇలాంటి మాఫియా వుందని, అది రంగంలోకి దిగి నెల నెల రేషన్ బియ్యం తీసుకుంటున్న వారి నుంచి కొనుగోలు చేసి, మిల్లర్లకు అందిస్తుందనేది భహిరంగ రహస్యమే. అయినా అధికారుల చెవికెక్కదు. ఇప్పుడు రాష్ట్రంలో వున్న అక్రమ మిల్లర్లు తమ బకాయిలు ఎగ్గొట్టేందుకు సిద్దమయ్యారు. మిల్లర్లందు డిఫాల్టు మిల్లర్లు వేరయా..వాళ్లు ప్రభుత్వాన్ని మోసం చేసి దాచుకున్న సొమ్ము వందల కోట్లయా? అని రేపు రేపు సమాజంలో పాటలు పుట్టుకొస్తాయేమో!! అవును. ఓ వైపు ప్రభుత్వాలు రైతంగం సంక్షేమం కోసం ఆలోచిస్తుంటే, మిల్లర్లు మాత్రం ప్రభుత్వాన్ని ఎలా మోసం చేయాలి. ప్రభుత్వ సొమ్ముకు ఎలా ఎగనామం పెట్టాలి. కోట్ల రూపాయలు బకాయిలు ఎలా పేరుకుపోవాలి? తర్వాత తాము అన్యాయమైపోతున్నామని ఎలా మొత్తుకోవాలి? అనేదానిపై నిమగ్నమై వున్నారని పిస్తోంది. రైతుల సంక్షేమం కన్నా, మిల్లర్లకు పరోక్షంగా అందుతున్న సంక్షేమమే ఎక్కువైపోతోంది. ఇంతలా ప్రభుత్వాలను కొంత మంది అక్రమ, డిఫాల్ట్ మిల్లర్లు ఓ వైపు ప్రభుత్వాన్ని మోసం చేస్తుంటే, మరో వైపు వాళ్లకే మేలు జరిగే కొన్ని కార్యక్రమాలు తెలియకుండానే జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన వడ్లను బియ్యం చేసుకొని, అమ్ముకొని కోట్లు కూడబెట్టుకున్న మిల్లర్లు తెలంగాణలో ఎంతోమంది వున్నారు. వాళ్ల నుంచి నిక్కచ్చిగా బకాయిలు వసూలు చేస్తే కొన్ని వేల కోట్ల రూపాయలు వస్తాయి. కాని ఆ పని అధికారులు చేయరు. ఆ దిశగా అదికారులు దృష్టి పెట్టరు. కొంత మంది అవినీతి అదికారుల మూలంగా మిల్లర్లు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వాన్ని నిండా ముంచేస్తున్నారు. దశాబ్దాలుగా ఈ మోసం చేస్తూనే వున్నారు. అయినా ఇంత కాలమైనా వారి నుంచి ఒక్క రూపాయి వసూలు చేసింది లేదు. వారిపై కేసులు నమోదు చేసింది లేదు. వారిని జైలుకు పంపిందిలేదు. వాళ్ల మిల్లలను వేలం వేసింది లేదు. ఆ సొమ్మును రికవరీ చేసింది లేదు. అదికారులు ఏం చేస్తున్నారు అంటే? చోద్యం చూస్తున్నారు. ప్రభుత్వాలకు తప్పుడు లెక్కలు చెబుతున్నారు. ప్రభుత్వాలను తప్పు దోవ పట్టిస్తున్నారు. ఇటు జీతాలకు జీతాలు, ఇటు మిల్లర్ల నుంచి ముడుపులు ముట్టుకుంటూ ప్రభుత్వ ఖజానకు గండి కొడుతున్నారు. ఇంత దోపడీ జరుగుతున్నా ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం వుండదు. వాళ్లు సివిల్ సర్వీసెస్ మీద పూర్తి దృష్టి పెట్టే సమాయానికి వారు ఆ కుర్చీలో వుండరు. ఇదే తంతు. దశాబ్దాలుగా సాగుతున్న అక్రమ సంపాదలనకు అడ్డుకట్ట పడిందిలేదు. మిల్లర్లనుంచి రూపాయి వసూలు చేసేందుకు ఎవరూ సిద్దపడింది లేదు. ఏదో హడావుడి చేయడం, మళ్లీ మిల్లర్ల నుంచి లంచాలు తీసుకోవడమే సరిపోతుంది. మిల్లర్లను దారిలో పెట్టింది లేదు. వాళ్లను దారికి తెచ్చింది లేదు.




22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక





శనివారం 25-07-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 109 రూ॥ 6.00


# జన్‌జీ ఉద్యమం... ప్రాంతీయ పార్టీలకు

# కొండంత బలం!

## ప్రాంతీయ పార్టీలకు రానున్న పూర్వవైభవం!




- తెలంగాణలో బిఆర్ఎస్ కు యువత బ్రహ్మరథం.
- ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఎన్నికల్లో జగన్ దే రాజ్యం.
- తమిళనాడులో జాతీయ పార్టీలు కోలుకోవడం ఇక కష్టం.
- ఉత్తర ప్రదేశలో అయితే అఖిలేష్, లేకుంటే మాయావతి కి లాభం.
- బెంగాల్ లో మమత మళ్ళీ కోలుకోవడం ఖాయం.
- ఢిల్లీ భవిష్యత్తులో ఆప్ పార్టీకి వశం.
- పంజాబ్ లో ప్రాంతీయ పార్టీలదే సర్వాధికారం.
- మహా రాష్ట్ర లోనూ శివసేన,ఎన్ సిపి లకుమార్గం సుగమం.
- కర్ణాటకలో జాతీయ పార్టీల భవిష్యత్తు తిరోగమనం.

- జాతీయ పార్టీలకు రాజకీయ సంకటం.
- ఒక్కసారి పడిపోతే మళ్ళీ ఊపిరి పోసుకోవడం చాలా కష్టం.
- కోలుకోవడానికి పట్టేందుకు చాలా కాలం.
- దేశమంతా మళ్ళీ ఊపులోకి రానున్న ప్రాంతీయ పార్టీల వైభవం!
- యువత వల్ల మళ్ళీ కోలుకునేందుకు పడుతున్న మార్గం.
- ఈశాన్య రాష్ట్రాలలో కూడా ప్రాంతీయ పార్టీలకు కలిసొచ్చే కాలం.
- దేశమంతా వచ్చే ఎన్నికలలో ప్రాంతీయ పార్టీలదే ప్రభంజనం.
- జాతీయ పార్టీలను నమ్ముకుంటే ప్రాంతీయ ప్రయోజనాలు శూన్యం.
- కాకపోతే బీజేపీ కన్నా కాంగ్రెస్ కు కొంత కలిసొచ్చే అవకాశం.
- బీజేపీ చేజేతుల కోరుకుంటున్న పతనం.
- దేశమంతా కీర్తిస్తున్న తరుణంలో చేసుకుంటున్న ఖర్మం.

హైదరాబాద్, నేటిధాత్రి:

యువతరం కదిలింది. నవతరం మేలుకొన్నది. తన భవిష్యత్తును తానే రాజకీయం రాసుకుంటోంది. జాతీయ పార్టీలకు కాలం చెల్లేకాలమొచ్చింది. ప్రాంతీయ పార్టీలకు మళ్లీ పూర్వ వైభవం రానున్నది. కొత్త రాజకీయ శక్తులకు అవకాశం వస్తుంది. సరికొత్త నాయకత్వాలకు దేశం వేదిక కానున్నది. రాష్ట్రాల ప్రయోజనాల వాణి వినిపించే సమయం ఆసన్నమైంది. యువత ఆకాంక్షలకు అనుగుణమైన ప్రభుత్వాల ఏర్పాటుకు మార్గం సుగమమౌతోంది. అన్యాయాలకు, అక్రమాలకు తావు లేని సమాజ నిర్మాణం కోసం అడుగులు పడుతున్నాయి. ఇంత కాలం బూజు పట్టిన రాజకీయాలను ఏలిన నాయకులకు గండం వచ్చి పడుతోంది. వారసత్వ రాజకీయాలకు ఇక చరమగీతం పాడే సమయం ఆసన్నమైంది. దశాబ్దాలుగా ఏలుతున్న నాయకుల ఆధిపత్యానికి ఫుల్‌స్టాప్ పడనుంది. జన్‌జీ ఉద్యమంతో కొత్త తరం రాజకీయాలు పురుడుపోసుకునే దారులు పడుతున్నాయి. దేశ నిర్మాణంలో యువత పాత్ర మళ్లీ తెరమీదకు వచ్చింది. దేశ భవిష్యత్తుకు యువతే ప్రాణం అనేది మళ్లీ చాటి చెప్పేందుకు చైతన్యం రగులుతోంది. మొత్తంగా దేశంలో కొత్త కొత్త ప్రాంతీయ పార్టీలు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం వున్న ప్రాంతీయ పార్టీలకు మళ్లీ ఉపిరి రానున్నది. అదికారం కోల్పోయిన ప్రాంతీయ పార్టీలకు మళ్లీ గొంతు కానున్నది. రేపటి తరం ఉజ్వలమైన భవిష్యత్తుకు జన్‌జీ ఉద్యమం వేదిక కానున్నది. మొత్తంగా రాష్ట్రాల ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు, యువత ఆశయాలు, విద్యావంతమైన సమాజం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాలు, విద్యావసంతాలు, ఆరోగ్యకరమైన జీవితాలకు మంచి కాలం ముందుందనే సంకేతాలు అందుతున్నాయి. దేశభక్తి మనసు నిండిన యువత రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధమౌతోంది. సొంత ప్రయోజనాల కోసం పని చేసే రాజకీయాలకు కాలం చెల్లింది. అవినీతిని కూకటి వేళ్లతో పెలికించే సమాజ నిర్మాణం జరగనున్నది. ఆశ్రిత పక్షపాతానికి తావు లేని సమాజం రూపు దిద్దుకోనున్నది. ప్రశ్నించే సమాజమే ప్రగతికి మూలమనే భావన అందరిలోనూ కలిగే సమయం ఆసన్నమైంది. ఏ వ్యవస్థకు, ఏ వ్యవస్థ బానిస కాకుండా, అన్ని వ్యవస్థలకు పరిపూర్ణమైన సేచ్ఛ కలిగే కాలం ముందుందని తెలుస్తోంది. ఇదంతా చూస్తుంటే దేశ మంత మళ్లీ ప్రాంతీయ పార్టీలకు పూర్వ వైభవం భవిష్యత్తులో కనిపించనున్నది. తెలంగాణ విషయంలో బిఆర్ఎస్‌పార్టీకి మంచి రోజులు రానున్నాయి. ఎందుకంటే ఆ పార్టీలో రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యుక్తులున్న నాయకులు ఎంతో మంది వున్నారు. వివిధ రంగాలలో నిష్ణాతులున్నారు. పాలనానుభవం వున్న నాయకులున్నారు. ప్రజలకోసం పనిచేసిన ఉద్యమకారులున్నారు. యువతరం ఆశీస్సులున్నాయి. నవతరం పెద్దగా తెలంగాణ సాధించిన కేసిఆర్ వున్నారు. ఆయన పదేళ్లలో చేసిన అభివృద్ధి కళ్లముందు వుంది. ఒకప్పుడు కరువు తాండవించిన నేలలో సిరులు కురిపించిన కేసిఆర్ ప్రగతి భావన మళ్లీ కావాలని జనం కోరుకుంటున్నారు. కేసిఆర్ నాయకత్వంలో మళ్లీ పాలన రావాలని, స్వరాష్ట్రంలో కేసిఆర్‌స్వర్ణయుగ పాలన కావాలని యువత కూడా కోరుకుంటోంది. కేటిఆర్, హరీష్‌రావులు వున్నారు. వారికితోడుగా గతంలో



మంత్రులుగా పనిచేసిన నాయకులు పార్టీకి బలంగా వున్నారు. దాంతో తెలంగాణలో బిఆర్ఎస్ తిరుగులేని శక్తిగా, ఎదురు లేని నాయకత్వంతో ముందుకు రానున్నది. ప్రజా ప్రభంజనం మళ్లీ సృష్టించనున్నది. తమిళనాడులో ఇప్పటి వరకు జాతీయపార్టీలకు పెద్దగా స్థానం లేదు. ఇకపై వుంటుందన్న నమ్మకం కూడా లేదు. జెన్‌జీ ఉద్యమంతో ఇక మరో రెండు దశాబ్దాల పాటు జాతీయ పార్టీలకు తమిళనాడులో స్థానం వుంటుందని అనుకోవడం లేదు. ప్రస్తుతం సిఎంగా వున్న విజయ్‌కు వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు బ్రహ్మరథం పట్టొచ్చు. లేకుంటే అక్కడున్న మరో రెండు ప్రాంతీయ పార్టీలకు జనం జేజేలు కొట్టొచ్చు. ఆ పార్టీలతో కలిసి సాగితే తప్ప జాతీయ పార్టీలకు ఉనికి లేకుండాపోవచ్చు. కర్నాటకలో కూడా జాతీయ పార్టీలకు ఇబ్బందికరమైన పరిస్థితులే ఎదురుకావొచ్చు. జనతా దళ్(సెక్యులర్)కు పూర్వపు రోజులు రావొచ్చు. గతంకన్నా మరింత పుంజుకోవచ్చు. కొత్త పార్టీలు పురుడుపోసుకోవచ్చు. బిహార్‌లో జేడియూ, ఆర్‌జేడిలదే ఇంత కాలం రాజ్యం. అయితే మధ్యలో బిజేపి పెరుగుదలతో ఆ పార్టీ చేతిలో ఇప్పుడు సాగుతున్న ప్రభుత్వం. ఇక భవిష్యత్తులో లాలు ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్‌జేడికి మళ్లీ మంచి రోజులు రావొచ్చు. మహారాష్ట్రలో ఒకప్పుడు కాంగ్రెస్, శివసేన నువ్వానేనా అన్నట్లు వుండేది. ఇప్పుడు బిజేపి, శివసేన నువ్వా నేనా అన్నట్లు తయారైంది. కాకపోతే మధ్యలో ఎన్‌సిపి. శరద్‌పవార్ వున్నారు. కాకపోతే అటు శివసేన, అటు ఎన్‌సిపిలలో చీలక ఏర్పడింది. అసలు శివసేన ఏక్‌నాద్ షిండేదే అని అంటున్నారు. భవిష్యత్తులో మళ్లీ ఉద్దవ్ ధాకరేకు మళ్లీ పూర్వ వైభవం రావొచ్చు. పాత శివసేన బలపడొచ్చు. కాలం కలిసి వస్తే అధికారం కూడా దక్కొచ్చు. ఎన్‌సిపి విషయంలో కొంత మళ్లీ గందరగోళం జరగొచ్చు.

శరద్‌పవార్ పార్టీ కీలకం కావొచ్చు..కాని అదికారం దాకా రాకపోవచ్చు. ఇక దేశంలో కేంద్ర ప్రభుత్వ రాజకీయ కేంద్ర బిందువైన ఉత్తర ప్రదేశ్‌లో మళ్లీ ఎస్పీ, బిఎస్పీలకు కాలం కలిసి రావొచ్చు. ముఖ్యంగా సమాజ్‌వాదీ పార్టీకి ప్రజలు పట్టం కొట్టొచ్చు. తర్వాత స్థానంలో బిఎస్పీ వుండొచ్చు. మూడో స్థానంలో కాంగ్రెస్‌కు అవకాశం రావొచ్చు. బిజేపికి ఉత్తర ప్రదేశ్ నుంచే చుక్కలు కనిపించొచ్చు. ఇక అత్యంత కీలకమైన దేశ రాజధాని డిల్లీలో మళ్లీ చీపురుకు పూర్వ వైభవం రావొచ్చు. ఆప్ పార్టీకి ఒక్క డిల్లీలోనే కాకుండా దేశ మంతా విస్తరించే అవకాశలు కూడా కనిపించొచ్చు. ఇప్పటికే ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, హర్యానా, పంజాబ్‌లలో ఆప్ పార్టీ బలంగానే వుంది. డిల్లీ తర్వాత పంజాబ్‌లో అదికారంలోకి కూడా వచ్చింది. పంజాబ్‌లో ప్రస్తుతం అదికారంలో కూడా వుంది. ఒక వేళ కాలం కలిసి వస్తే గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, డిల్లీలో అదికారం కైవసం చేసుకొని జాతీయ పార్టీల జాబితాలో బిజేపి, కాంగ్రెస్‌లను పక్కకు నెట్టివేయొచ్చు. ఎక్కువ రాష్ట్రాలు, కేంద్రంలోసీట్లు ఆప్ గెల్చుకోవచ్చు. ఒకటికి మించి రాష్ట్రాలలోమళ్లీ అదికారం పొందొచ్చు. అయితే పంజాబ్‌లో అకాలీదళ్ కూడా స్ట్రాంగ్‌గానేవుంది. ప్రస్తుతం ఆప్ అక్కడ అదికారంలోవుంది. జెన్‌జీ ప్రభావం ఆప్‌పై పడితే, పంజాబ్‌లో అకాలీదళ్‌కు పూర్వ వైభవం రావొచ్చు. ఇక ఏపి విషయానికి వస్తే అక్కడ కూడా జాతీయపార్టీలకు పెద్దగా స్కోప్ లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్ ప్రభంజనం చూడొచ్చు. జనసేను అంత సీన్ లేకపోవచ్చు. తెలుగుదేశం పార్టీ ఉనికి కాపాడుకోవచ్చు. భవిష్యత్తులో జగన్ తిరుగులేని నాయకత్వం కనిపించొచ్చు. రెంటికీ చెడిన రేవడిగా పవన్‌కల్యాణ్ నిలువొచ్చు. అటు తెలుగుదేశం పక్కన నిలబడలేక, ఇటు జాతీయపార్టీలతో అంటకాగలేక, జగన్‌కు ఎదరిరించి స్థాయి లేక చతికిలపడొచ్చు. కాలం వక్ర చపు చూస్తే జెండా పీకెయ్యొచ్చు? మూడు సార్లు ముఖ్యమంత్రి గా పనిచేసి, ఇటీవలే నాలుగోసారి గెలుద్దామనుకొని ఓడిపోయిన మమత బెనర్జీకి మళ్లీ కాలం కలిసి రావొచ్చు. ఆమె మళ్లీ తృణమూల్ జెండా ఎగురవేయవచ్చు. కేంద్ర రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకొవచ్చు. జాతీయ రాజకీయాల్లో ఆమె కీలక భూమిక పోషించే అదృష్టం రావొచ్చు. ఈశాన్య రాష్ట్రాలలో కూడా మళ్లీ ప్రాంతీయ పార్టీలకు అధికారాలు దక్కొచ్చు. మొత్తం మీద దేశంలో బిజేపి పరిస్థితి దినదిన గండంగా మారొచ్చు. పెరుగుట విరుగుట కొరకే అనే సామెతను నిజం చేసుకోవచ్చు. మళ్లీ కోలుకునేందుకు మొదటి మెట్టు నుంచి ప్రయత్నం చేయాల్సి రావొచ్చు. కొత్త రాజకీయ అవతారం ఎత్తొచ్చు. కాని మరో పదేళ్ల పాటు రాజకీయ ఉనికి కోసం ఆరాటం పడాల్సి రావొచ్చు. కాకపోతే కాంగ్రెస్‌కు ఇప్పుడున్న పరిస్థితి కన్నా మెరుగైన స్థితికి చేరుకోవచ్చు. ప్రాంతీయ పార్టీలతో కలిసి, దేశ రాజకీయాల్లో కీలకభూమిక పోషించొచ్చు. కేంద్రంలో అదికారం అందుకోవచ్చు. లేకుంటే ప్రాంతీయ పార్టీలకు జై కొట్టి పెద్దన్న పాత్ర పోషించొచ్చు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి




"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

మీ కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999



# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



శనివారం 25-07-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 109 రూ॥ 6.00


# మేక్ ఇన్ ఇండియా పోయింది.. లీక్ ఇన్ ఇండియా వచ్చింది!






పుట్టినరోజు వేడుకలు రద్దు చేసి నల్లచొక్కాతో విద్యార్థుల పోరాటంలో కేటీఆర్

- ఇందిరాపార్క్‌కు విద్యార్థుల వెల్లువ.. నీట్ పేపర్ లీక్, ఢిల్లీ లాఠీచార్జ్‌కు నిరసనగా బీఆర్ఎస్వీ మహాధర్నా
- “తరం మారుతుంది.. స్వరం మారుతుంది.. జెన్‌జెడ్‌తో పెట్టుకున్నావు జాగ్రత్త మోదీ” : కేటీఆర్ హెచ్చరిక

హైదరాబాద్, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారం, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకుంటున్న వరుస అవకతవకలు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ ఆందోళన చేపట్టింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన 50వ పుట్టినరోజు వేడుకలను పూర్తిగా రద్దు చేసుకుని నల్లచొక్కా ధరించి ఈ నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత, బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

సభ ప్రాంగణం మొత్తం నల్లజెండాలు, ప్లకార్డులు, నినాదాలతో మారుమోగింది. నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడవద్దని డిమాండ్ చేస్తూ యువత పెద్దఎత్తున నినాదాలు చేశారు.

### “మేక్ ఇన్ ఇండియా కాదు... లీక్ ఇన్ ఇండియా”

సభలో ప్రసంగించిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “దేశాన్ని మేక్ ఇన్ ఇండియా అని చెప్పిన వారు ఇప్పుడు లీక్ ఇన్ ఇండియాగా మార్చేశారు. పరీక్షలు నిర్వహించలేని ప్రభుత్వం దేశ భవిష్యత్తును ఎలా నిర్మిస్తుంది?” అని ప్రశ్నించారు. నీట్ మాత్రమే కాకుండా దేశంలో అనేక నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షలు వరుసగా లీక్ అవుతున్నాయని, లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు.

### “తరం మారుతుంది... స్వరం మారుతుంది”

“తరం మారుతుంది... స్వరం మారుతుంది... జెన్‌జెడ్‌తో పెట్టుకున్నావు జాగ్రత్త మోదీ” అంటూ ప్రధాని మోదీని కేటీఆర్ హెచ్చరించారు. నేటి యువత సోషల్ మీడియా ద్వారా నిజాలను దేశానికి చేరవేస్తోందని, మీడియా మౌనం పాటించినా యువత గళాన్ని ఎవరూ అణచలేరన్నారు. నేపాల్‌లో యువత ఉద్యమాల ప్రభావాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, యువత సంకల్పిస్తే ప్రభుత్వాలనే మార్చగల శక్తి ఉందని వ్యాఖ్యానించారు.

### “సోనమ్ వాంగ్‌చుక్ దీక్షను కూడా చూపలేదు”

దేశంలో ప్రజాస్వామ్య స్వరాలను అణచివేస్తున్నారని ఆరోపించిన కేటీఆర్, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన దీక్షకు ప్రధాన మీడియా ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. “ఈడీ, సీబీఐ భయంతో చాలా మీడియా సంస్థలు నిజాలను చూపడం లేదు. కానీ ఈ తరం చేతిలో సోషల్ మీడియా ఉంది. నిజం దాచిపెట్టడం ఇక సాధ్యం కాదు” అని అన్నారు.

### కాంగ్రెస్, బీజేపీలపై ఒకేసారి విమర్శలు

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వస్తే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. “బడే భాయ్ కోసం చోటే భాయ్ అడ్డం పడుతున్నాడు. మోదీని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది?” అంటూ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో నిరసనలు చేస్తుంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

### “విద్యార్థులకు అండగా కేసీఆర్ కూడా వస్తారు”

విద్యార్థుల న్యాయమైన ఉద్యమానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతుగా ఉంటుందని కేటీఆర్ ప్రకటించారు. “అవసరమైతే కేసీఆర్ కూడా విద్యార్థుల కోసం రోడ్డెక్కుతారు. సోషల్ మీడియాలో విద్యార్థుల బాధ చూస్తే ఆయన కూడా కలత చెందుతున్నారు. పిల్లలే దేశ భవిష్యత్తు... వాళ్లే దేశ ముఖచిత్రాన్ని మార్చగలరు” అని అన్నారు.

### యువతకు హామీలు

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ప్రాధాన్యత ఇస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పారదర్శక ఉద్యోగ నియామకాలు, పేపర్ లీక్‌లకు తావులేని పరీక్షల వ్యవస్థ, సమయానికి నోటిఫికేషన్లు, ఆధునిక సాంకేతికతతో పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర సంస్కరణలు తీసుకొస్తామని తెలిపారు.

### విద్యార్థుల ఆవేదన

నిరసనలో పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ తమ ఉద్యమంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపించారు. “మాకు ఎలాంటి ఫండింగ్ రావడం లేదు. మాపై తప్పుడు ప్రచారం చేయడానికి సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రశ్నిస్తే యాంటీ నేషనల్ అంటున్నారు. మేము దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్నాం” అని పేర్కొన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

### “ఒక్క విద్యావ్యవస్థ కాదు... అన్ని వ్యవస్థలు దిగజారుతున్నాయి”

దేశంలో విద్యా వ్యవస్థ మాత్రమే కాకుండా అనేక రంగాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీక్‌లతో వేలాది మంది విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారని, కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పెట్రోల్ ధరలు, రూపాయి విలువ, నిరుద్యోగం, ఆర్థిక పరిస్థితి వంటి అనేక అంశాల్లో దేశం వెనుకబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఇందిరాపార్క్‌లో నినాదాలతో మారుమోగిన ఉద్యమం

నిరసనలో పాల్గొన్న విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు, నల్లజెండాలు పట్టుకుని కేంద్ర








ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “పేపర్ లీక్‌లను అరికట్టాలి”, “విద్యార్థులకు న్యాయం చేయాలి”, “ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి”, “విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు” అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

### బీఆర్ఎస్ సందేశం

ఈ నిరసనతో విద్యార్థుల సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకురావడమే లక్ష్యమని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. యువత, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని, కేంద్ర ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

---

## పరీక్షల సంస్కరణలపై సుప్రీం కీలక ఆదేశాలు



- తాత్కాలిక సర్దుబాట్లు కాదు.. శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- కేంద్రం, ఎన్‌టీఏకు సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారం అనంతరం పరీక్షల నిర్వహణలో చేపట్టిన

08 లో



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- విద్యార్థులపై నమోదైన కేసులు ఎత్తివేయాలని సీజేపీ డిమాండ్

08 లో

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు శుక్రవారం కేంద్ర మంత్రులు

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు పెట్టిన నిత్యానందరాయ్



08 లో

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
లోక్‌సభ, రాజ్యసభల్లో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ జరపాలని ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ

---



## విద్యుత్ వ్యవస్థపై హరీశ్‌రావు ఆకస్మిక తనిఖీ

- సోలేపేట సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా, నిర్వహణపై ఆరా
- సిబ్బందిని ప్రశ్నించిన మాజీ మంత్రి.. ప్రజలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచన

హైదరాబాద్, నేటిధాత్రి:
రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారం మండలం సోలేపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా, నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించి అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, లోడ్ పరిస్థితులు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం, నిర్వహణ విధానం, విద్యుత్ అంతరాయాలకు గల కారణాలపై అక్కడి విద్యుత్ శాఖ సిబ్బందిని ప్రశ్నించి సమాచారం సేకరించారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సబ్‌స్టేషన్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరికరాల పనితీరును కూడా హరీశ్‌రావు పరిశీలించారు. నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితో చర్చించారు. విద్యుత్ సరఫరా విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిసింది.

సబ్‌స్టేషన్ సందర్శన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత హరీశ్‌రావుతో పాటు పాల్గొన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హరీశ్‌రావు రాక సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికాయి.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ తీరును పరిశీలించిన అనంతరం స్థానికులతో కూడా హరీశ్‌రావు మాట్లాడి విద్యుత్ సరఫరాపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యుత్ సేవల నాణ్యత మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

---

# జనావాసాల్లోనే ఇళ్లు

## ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపునకు సీఎం ఆదేశం



- ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ గృహాల నిర్మాణం
- 17 నియోజకవర్గాల్లో తొలి విడత ఇళ్ల నిర్మాణానికి కసరత్తు
- పేదలకు నగరానికి చేరువలోనే సొంతిల్లు
- ఖాళీ ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ గృహాల నిర్మాణం
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, నేటిధాత్రి:
నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆరఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ.5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి



వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను గృహ నిర్మాణం కోసం వినియోగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఖాళీ ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిరుపేదలకు నగరానికి చేరువలోనే గృహాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---



## పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలి: మహేష్ గౌడ్

- నల్లచొక్కా డ్రామాలను ప్రజలు నమ్మరన్న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ మౌనమే ఎందుకని ప్రశ్నించారు

హైదరాబాద్, నేటిధాత్రి :
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు నాడైనా కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. నల్ల చొక్కాలు వేసుకున్నంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు. కపట ప్రేమలు, నల్లచొక్కా డ్రామాలు నడవవని చెప్పుకొచ్చారు. ‘రేవంత్ ఢిల్లీకి వెళ్తే ఏంటి? వెళ్లకపోతే ఏంటి?.. కొడంగల్‌లో నిరసన చేశారు’ అని అన్నారు. విద్యార్థుల ఉద్యమంపై కేసీఆర్ ఇప్పటిదాకా ఒక్క స్టేట్మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఎత్తేసిన ధర్నా చౌక్‌లో కేటీఆర్ ధర్నా చేశారని.. ధర్నా చేసే హక్కు ఆయనకు ఎక్కడిదని ప్రశ్నించారు.

కేటీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాక ధర్నా చేస్తే బాగుంటుందని మహేష్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో చనిపోయిన ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అకౌంట్ నుంచి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27 మంది విద్యార్థుల మరణానికి కారణం గ్లోబరీనా సంస్థ అని ఆరోపించారు. 2011లో జరిగిన గ్లోబరీనా అంశంలో నివేదిక ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ‘గ్లోబరీనాపై విచారణకు కేటీఆర్ ఫిర్యాదు చేయాలి. మాకు మేముగా విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారు’ అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీక్‌లు అందరికీ తెలుసని అన్నారు. ఇసుక వ్యాపారంతో ఎంతోమంది చావులకు కారణం కేటీఆర్ అని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కాదని.. రెండూ ఒకటే అనడానికి బలమైన కారణాలు ఉన్నాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# కేటీఆర్ జన్మదినం సందర్భంగా వృద్ధాశ్రమానికి వైద్య పరికరాల అందజేత



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండెపల్లి ప్రభుత్వ వయోవృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న-లింగం ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆరోగ్య పరీక్షల కోసం అవసరమైన వెయిట్ మిషన్, షుగర్ పరీక్ష పరికరం (గ్లూకోమీటర్), బీపీ పరీక్ష యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేటీఆర్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం బీఆర్ఎస్ పార్టీ సంప్రదాయమని తెలిపారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు ఈ పరికరాలు ఉపయోగపడతాయని, వృద్ధాశ్రమ నిర్వాహకులు కూడా ఈ సేవను అభినందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తంగళ్ళపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వృద్ధాశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్థివ దేహానికి నివాళులర్పించిన మండల అధ్యక్షుడు.



**చిట్యాల, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని చిట్యాల వాస్తవ్యులు చిలుముల రమణాచారి, రాజమొగిలి తండ్రి చిలుముల శేఖరయశుక్రవారం రోజున ఉదయం మరణించినందున వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతిలి వారి వెంట జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, టౌన్ అధ్యక్షుడు గంగాధర రవి, మండల సీనియర్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, మాజీ ఎంపీటీసీ కట్కూరి నరేందర్, మార్కండేయ, గుర్రపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# కెటి రామారావు జన్మదినశీ పురస్కరించుకుని బట్టలు పంపిణీ చేసిన బి ఆర్ ఎస్ నాయకులు..





**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీ రామారావు జన్మదినం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బట్టలు పంపిణీ చేయడం జరిగింది.
ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు. పాక్స్. వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా గిఫ్ట్ స్మైల్ లో భాగంగా కార్మికులందరికీ బట్టలు పంపిణీ చేయడం జరిగింది తెలియజేస్తూ. మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాల మేరకు. ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ సందర్భంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీని నిరసిస్తూ. విద్యార్థులకు సంఘీభావంగా తన పుట్టినరోజు వేడుకలను నిర్వహించవద్దని రాష్ట్రవ్యాప్తంగా తెలియజేశారని తెలియజేస్తూ. నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో మా వంతుగా హడావుడి చేయకుండా సాధారణంగా వేడుకలు జరుపుకోవాలని సందర్భంగా. మా వంతుగా తంగలపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ చేయడం జరిగిందని. అలాగే మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ చేయడం జరిగిందని తెలియజేస్తూ. గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో సాధారణంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం జరిగిందని కెటి రామారావు జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముందుగా లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగిందని. కెటి రామారావు. నిండు నూరేళ్లు పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు పొందాలని. రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటూ సేవ చేసే భాగ్యాన్ని ఆ దేవుళ్ళు అందించాలని ప్రత్యేక పూజలు చేయడం జరిగిందని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో. టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజన్న. మాజీ జెడ్పిటిసి కోడి అంతయ్య. పాక్స్. మాజీ చైర్మన్ బండి దేవదాస్. పాక్స్. వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి. తంగళ్ళపల్లి ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి. బొల్లి రామ్మోహన్. తంగళ్ళపల్లి మాజీ ఎంపీపీలు. సరస్వతి. మానస. మాజీ సర్పంచులు. శివ జ్యోతి. అంజయ్య. వేణుగోపాలరావు. రాజు. రామా గౌడ్. తంగళ్ళపల్లి గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు. బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# కెటి రామారావు జన్మదిన సందర్భంగా వైద్య పరికరాలు పండ్లు అందజేసిన మాజీ ఎంపీటీసీ..



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం మండపల్లి వయో వృద్ధులఆశ్రమంలో. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మండపల్లి మాజీ ఎంపిటిసి బుస స్వప్న లింగం
మరియు నాయకుల ఆధ్వర్యంలో వైద్య పరికరాలు అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తూ. మాజీ ఎంపిటిసి బుస స్వప్న లింగం మాట్లాడుతూ. బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి సిరిసిల్ల అభివృద్ధి ప్రదాత కేటీ రామారావు జన్మదినంమా పురస్కరించుకొని. తంగళ్ళపల్లి మండలం మండపల్లి ఆశ్రమంలో. వృద్ధులకు వెయిట్ మిషన్. బిపి. షుగర్ టెస్ట్ పరికరాలు అందజేయడం జరిగిందని. తెలియజేస్తూ. అలాగే నాయకుల ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు మాజీ మంత్రి కేటీ రామారావు భవిష్యత్తులోమరిన్ని పదవులు పొందాలని. ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో నిండు నూరేళ్ల చల్లగా ఉండాలని కోరుకుంటున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో. మాజీ ఎంపీపీలు. మాజీ సర్పంచులు మాజీ జెడ్పిటిసి. ప్రజా ప్రతినిధులు. బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రజా కవి గుర్రం జాషువా 55వ వర్ధంతి వేడుకలు.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురుకుంట్ల కిరణ్ అధ్యక్షతన కవి రచయిత గుర్రం జాషువా 55వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేయటం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్యలి మాట్లాడుతూ రాజు చనిపోతే తార రాలుతుంది కవి చనిపోతే తారా నింగిని చేరుతుంది అన్న కవి నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా అన్నారు. ఆయన సెప్టెంబర్ 28 1865 లో జన్మించారని జూలై 24 1971లో మరణించాడని తెలిపారు. ఆయన బాల్యంలోనే కులవ్యాప్త అంటరానితనం అవమానాలు పేర్కొన్నాడని అన్నారు. సాహిత్యం అభ్యసించిన జాషువా 39 గ్రంథాలను వందలాది కవిత్వాలను రాశాడని అన్నారు, తన కవిత్వంతో ఆయుధంగా మరిచిన గొప్ప ప్రజాకవి గుర్రం జాషువాని అన్నారు. నేటి యువత ఆయన బాటలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు మండల్ నాయకులు పాముకుంట్ల చందర్ దబ్బేట రవి పర్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# పరకాల పట్టణంలో పారిశుధ్య సమస్య తీవ్రం

▶▶పలు కాలనీల్లో రోడ్లపై, పేరుకుపోతున్న చెత్త ప్రజారోగ్యానికి ముప్పు...




**పరకాల, నేటిధాత్రి:** పట్టణంలోని పలు కాలనీల్లో చెత్తబుట్టలు లేకపోవడంతో పారిశుధ్య సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. మాదారం కాలనీ, భూపాలపల్లి రోడ్డులోని ఐజల్ వాటర్ ప్లాంట్ ఎదురుగా, సౌందరయ్య ఆసుపత్రి సమీపంలో, భూపాలపల్లి రోడ్డుతో పాటు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు గృహ వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువల్లో, ఖాళీ స్థలాల్లో వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తూ పట్టణ సౌందర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పట్టణంలో తగిన సంఖ్యలో చెత్తబుట్టలు ఏర్పాటు చేయకపోవడం, ఇంటింటికీ చెత్త సేకరణ వ్యవస్థ సక్రమంగా అమలు కాకపోవడం వల్ల ప్రజలు ప్రత్యామ్నాయం లేక బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఆహార వ్యర్థాలు, గృహ చెత్త, చెట్ల కొమ్మలు, ఇతర వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. వర్షాలు కురిసిన సమయంలో కాలువలు మూసుకుపోయి నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు అధికంగా పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన





రహదారుల వెంట, కాలనీల్లో, ఆసుపత్రులు, విద్యాసంస్థల సమీపంలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతిరోజూ ఈ ప్రాంతాల గుండా ప్రయాణించే ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, ఇతర అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పట్టణంలోని అన్ని కాలనీల్లో తగిన సంఖ్యలో చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ చెత్త సేకరణను క్రమబద్ధీకరించాలని, ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను తొలగించి కాలువలను శుభ్రపరచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.
చెత్తబుట్టల ఏర్పాటు, క్రమబద్ధమైన చెత్త సేకరణ, నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టినప్పుడే పరకాల పట్టణంలో నెలకొన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**▶▶తక్షణమే చెత్తబుట్టలు ఏర్పాటు చేయాలి...** పట్టణంలో పారిశుధ్య సమస్యకు ప్రధాన కారణం చెత్తబుట్టల కొరతే, పట్టణంలోని ప్రతి కాలనీ, ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల వద్ద తగిన సంఖ్యలో చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలి. ఇంటింటికీ చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించి, పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలి, వర్షాకాలంలో చెత్త కాలువల్లో చేరి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి అన్ని కాలనీల్లో చెత్తబుట్టలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలి, అలాగే ప్రజలు కూడా చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాల్సిన అవసరం ఉంది.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి

ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ డిమాండ్....




**భూపాలపల్లి, నేటిధాత్రి:** నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మట్టేవాడ సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరణ తెలిపారు. నీట్‌కు సంబంధించిన సమస్యలపై న్యాయం చేయాలని ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించే చర్య అని వారు తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై బలప్రయోగం చేయడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. నీట్ వ్యవహారంలో జరిగిన వైఫల్యాలకు పూర్తి బాధ్యత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వహించాలని, నైతిక బాధ్యత స్వీకరించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేసి, ప్రశ్నించిన వారిపై లాఠీలు ఎత్తడం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నీట్ వ్యవహారం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1 కోటి నష్టపరిహారం చెల్లించాలని, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన పరిస్థితులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని తెలిపారు. బంద్‌కు సహకరించిన విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆవేదనను గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేకపోతే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ జిల్లా నాయకులు ఉల్లేరావు బన్నీ, జిమ్మడ సాయిరాం, భూక్య నవీన్, కిషోర్, వినోదు, సాత్విక్, అక్రమ పాషా, జంపుల రాజేష్ జంపుల. చందు గునిగంటి అజయ్ . పైసా సిద్దు తాడిచెట్టు అక్షయ్ రాజేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన

# "కెటిఆర్" జన్మదిన వేడుకలు..



**జహీరాబాద్, నేటిధాత్రి:** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు 50 వ పుట్టినరోజు వేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఘనంగా నిర్వహించడం జరిగింది . శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు గారి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు కేక్ కట్ చేసి కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతి రథసారథి, ప్రజల ఆశీస్సులతో నిత్యం ముందుకు సాగుతున్న కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ! ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజి ఆత్మ



చైర్మన్ విజయ్ కుమార్, మాజి మున్సిపల్ చైర్మన్ తంజిం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, కౌన్సిలర్ లు దీపక్, మహిపాల్ యాదవ్, జాకీర్, జాహీద్, విశ్వేశ్వర్, రాజు, ప్రవీణ్ , వివిధ గ్రామాల సర్పంచ్ లు మచ్చేందర్, గోవర్ధన్ రెడ్డి , రాజు, రాథోడ్ భీమ్ రావు నాయక్, శ్రీనివాస్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరూ రాథోడ్, బిసి సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్, పట్టణ నాయకులు బరూర్ దత్తాత్రి ,గణేష్, చంద్రయ్య, జియా గౌరి, నసీర్ , వెంకట్, శివ కుమార్ స్వామి, హంజా, అక్బర్, రవి చౌహాన్, అఫ్జర్ మొహియుద్దీన్, ఇబ్రహీం, నరసింహ రెడ్డి , జుబేర్ ,వెంకట్ , సందీప్ రాజ్ , బంజారా నాయకులు గోపాల్ ,కిషన్, చందు నాయక్, రామ్ శెట్టి, విజయ్ రాథోడ్ , నాయకులు సయీద్ , కరణ్, అరుణ్, శ్రీకాంత్ , రాజు, అజీమ్ పటేల్, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బోరు మోటారు ఉన్న ప్రారంభించిన సర్పంచ్..



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం టెక్స్టైల్ పార్క్ ఇందిరమ్మ కాలనీ గ్రామంలోని ఐదో అవార్డులో. పాత బోరు మోటార్ను పున ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. గ్రామపంచాయతీ గడ్డం రచన మధుకర్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధి కోసం మీ అందరి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామని. ప్రజలకు త్రాగునీరు. పారిశుద్ధ్యం. వీధి దీపాలు. వంటి మౌలిక సదుపాయాల కల్పనలు. గ్రామపంచాయతీ ఎల్లప్పుడు ముందు ఉంటుందని. అలాగే మన ఇద్దరమ్మా కాలనీ గ్రామంలోని ఐదో వార్డులో. 13వ నంబర్ రోడ్డులో ఉన్న బోరు మోటారు కొంతకాలంగా పనిచేయకపోవడంతో. ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని. వెంటనే. రిపేరు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఎన్నికల సమయంలో ఈ సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన మాట హామీ మేరకు నేడు ఈ బోరు మోటర్ ను పున ప్రారంభించడం చేసి తిరిగి ప్రజలకు నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈశీదుకు సహకరించిన ప్రభుత్వ అధికారులకు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో. (=బొ):రాజు. ఎనగందుల వెంకటేశం. గ్రామ పంచాయతీ కార్యదర్శి. సుధా గోని ఆంజనేయులు. ఉప సర్పంచ్. కోశీడ శ్రీకాంత్. వార్డు సభ్యులు రాగుల రోజా. కొండ భరత్. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పరకాలలో విద్యాసంస్థల బంద్ విజయవంతం




▶▶విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్...

**పరకాల, నేటిధాత్రి:** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఎస్సీ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని బంద్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్ మాట్లాడుతూ ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై పారదర్శకంగా విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వీబీఎస్ఏ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. విద్య హక్కును పరిరక్షించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యక్షుడు దొమ్మటి విశ్వంత్, ప్రధాన కార్యదర్శి బన్నీ, నాయకులు రేవంత్, మహేష్, వినయ్, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జరుపుకున్న కేటీఆర్ జన్మదిన వేడుకలు.



**జహీరాబాద్, నేటిధాత్రి:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఝరాసంగం మండల కేంద్రంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశం మాజీ ఎంపీపీ బొగ్గుల సంగమేశ్వర్ మాజీ సర్పంచ్ జగదీశ్వర్ ప్రత్యేక పూజలు చేసి కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొప్ప విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్ అని అదే విధంగా హైదరాబాద్ ఐటి రంగంలో అనేక దేశ విదేశాల నుంచి వివిధ కంపెనీలను తీసుకువచ్చి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన నాయకుడు కేటీఆర్ అని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇటీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గ్రామ సర్పంచ్ వినోద బాలరాజ్ వివిధ గ్రామాల సర్పంచులు టౌన్ ప్రెసిడెంట్ బాబా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు,

# మృతదేహానికి నివాళులర్పించిన



బి ఆర్ఎస్ నాయకులు.

**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల కేంద్రానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుముల రమణచారి తండ్రి శేఖరయ్య శుక్రవారం రోజున ఉదయం మరణించగా వారి యొక్క స్వగృహంలో మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన చిట్యాల మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్ గారు మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ పి ఏ సి ఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్ రెడ్డి వారి వెంట జిల్లా మండల నాయకులు పాండ్రాల వీరాస్వామి క్యాతం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం



## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే భర్త రఫ్ చేయాలి...

## టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్....

**భూపాలపల్లి, నేటిధాత్రి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్‌కు సంపూర్ణ సహకారం అందించిన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు రవి పటేల్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భూపాలపల్లి అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రవి పటేల్ మాట్లాడుతూ, గత 23 రోజులుగా నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా విద్యార్థులపై అణచివేతకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందని అన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ నిర్వహిస్తున్న ఎన్‌టీఏ వ్యతిరేక ఉద్యమానికి సంఘీభావంగా టీఆర్పీ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లాలో విద్యాసంస్థల బంద్ నిర్వహించి తమ మద్దతును ప్రకటించామని తెలిపారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని, అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని రవి పటేల్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, వ్యవసాయ శాఖ జిల్లా అధ్యక్షుడు పింగిడి శంకరయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రామ్ చరణ్, గునికంటి విష్ణు, ప్రణీత్, శ్రీకాంత్, రాజేష్, రోడ్డ శ్రీనివాస్, నరేష్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఇంటిముందు నిరసనలు దుర్మార్గం



- రాహుల్ గాంధీ వక్ర బుద్ధి బయటపడింది
- బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు
- గుర్రపు నాగరాజు గౌడ్

**భూపాలపల్లి, నేటిధాత్రి:** ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసం ముందు కాంగ్రెస్ చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా టేకుమట్ల మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఢిల్లీలో విద్యార్థులు తలపెట్టిన చలో పార్లమెంట్ విద్యార్థుల ముసుగులో ఉన్న అరాచక శక్తుల జోక్యంతో హింసాత్మకం అయింది. విద్యార్థుల ముసుగులో ఉన్న అరాచక మూక దాడిలో వందల సంఖ్యలో పోలీసులు భద్రతా బలగాలు తీవ్ర గాయాల పాలైతే వారి మీద కనీసం సానుభూతి చూపించకుండా అరాచకం సృష్టించిన వారిపై పోలీసుల లాఠీ ఛార్జ్ ని నిరసిస్తూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాని నివాసం ముందు ధర్నాకి దిగి ఒక నీచపు సంప్రదాయానికి తెరలేపారు రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ. ఈ ఘటనతో రాహుల్ గాంధీ అరాచక మూకలను సమర్థిస్తున్నట్టుగా ప్రధాని కేంద్ర మంత్రుల ఇళ్ల మీద పడి అరాచకం సృష్టించండి అని అరాచక మూకలకు సందేశం ఇస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఈ ఘటనను బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది దేశంలో జాతీయవాద యువత ఉండగా దేశాన్ని అరాచక శక్తుల చేతుల్లోకి పోకుండా అడ్డుకుంటామని అన్నారు. దేశంలో యుపిఎ పాలనలో అనేక పేపర్ లీకులు జరిగాయి అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా అనేక పేపర్ లీకులు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. కానీ ఎప్పుడు ఏ మంత్రి రాజీనామా చేయలేదు. మోదీ ప్రభుత్వం పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అతి తక్కువ సమయంలో నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించారు వాటి ఫలితాలు కూడా వచ్చాయి. పేపర్ లీక్ కి పాల్పడిన వారిని ఇప్పటికే అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయి నిరసనల పేరుతో అరాచకం సృష్టించాలని కుట్రలు చేస్తే ప్రజలు ఊరుకోరు, ప్రజాస్వామ్య బద్ధంగా గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడు ఓ బి సి మోర్చా జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ మండల ఇన్చార్జి మోరే రవీందర్ రెడ్డి జిల్లా నాయకుడు కూర సురేందర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య సుబ్బక్కపల్లె సర్పంచ్ బొడ్డు రాజేందర్ దాగు రఘు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే సొంత ఖర్చులతో సీసీ రోడ్డు నిర్మాణం..



- ఎమ్మెల్యేకు ఆలయ పూజారుల కృతజ్ఞతలు...
- రూ.3 లక్షలతో ముత్యాలమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్...

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణ ప్రజల సౌకర్యార్థం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తన సొంత నిధులతో రూ.3 లక్షల వ్యయంతో వరంగల్ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై ఆలయ పూజారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ తో కలిసి సీసీ రోడ్డు పనులకు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి, పనులు పూర్తయ్యేలా సహకరించిన ఆయన సోదరుడు సూదిని అజయ్ రెడ్డికి ఆలయ పూజారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలగి రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ఎమ్మెల్యే సేవాభావం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా నర్సంపేట పట్టణంలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలి వెలిచాల

**కరీంనగర్, నేటిధాత్రి:** సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా వంద శాతం పూర్తి అయ్యేలా కాంగ్రెస్ బీఎల్ఏలు, పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్ కాన్పూరా, ప్రియదర్శిని కాలనీ మరియు 54వ డివిజన్ అశోక్‌నగర్ ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బీఎల్‌వోలు, పార్టీ నాయకులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. ప్రక్రియ ఎలా సాగుతుందని బిఎల్ఓ లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ బిఎల్ఓలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంగ్రెస్ నాయకులు సహకరించాలన్నారు. ఓటర్ల సవరణ కార్యక్రమంలో అడ్రస్సులు ఫోన్ నెంబర్లు దొరకకున్నా తగిన సహకారం అందించాలన్నారు. బిఎల్ఓలకు సహకారంగా మరి కొంతమంది సిబ్బందిని నియమించేందుకు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో మాట్లాడడం జరిగిందన్నారు. అదనంగా సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారని, రెండు ఓట్లు ఉంటే ఒక్క ఓటు ఉంచుకోవాలని ఎక్కడ ఉంచుకోవాలో ఓటర్ల నిర్ణయం అని



అందుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్వో లకు ఏమైనా సందేహాలు తలెత్తితే తనకు నేరుగా ఫోన్ చేయవచ్చని రాజేందర్రావు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అవగాహన లోపం లేదా నిర్లక్ష్యం కారణంగా నిజమైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌వోలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓటర్లలో ఒక్కరి పేరు కూడా మిస్ కాకుండా నాయకులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో కాంగ్రెస్ నాయకులు సహకరించాలన్నారు. బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలాగే ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. అడ్రస్ మిస్‌మ్యాచ్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్ల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరా తీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పకడ్బందీగా పూర్తయ్యేలా కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని రాజేందర్‌రావు సూచించారు. పూర్తిచేసిన ఎన్యుమరేషన్ ఫారాలను రాజేందర్రావు బిఎల్ఓలకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఐఆర్ కమిటీ మెంబర్ పద్మాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న 33వ డివిజన్ కార్పొరేటర్ హీనా ఆఫ్రీన్, ఇక్రం సికిందర్, 54డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తోవిటి సామ్రాట్, కాంగ్రెస్ నాయకులు ఖాజా, షహన్నా, గండి శ్యామ్ గండి గణేష్, వేల్పుల వెంకటేష్ సముద్రాల రమణారావు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- మోదీ దిష్టిబొమ్మ దహనం.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్....
- రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా నర్సంపేటలో కాంగ్రెస్ ధర్నా....
- టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ విమర్శలు....

**నర్సంపేట, నేటిధాత్రి:** కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుల గొంతు కోస్తున్నదని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ విమర్శలు చేశారు. పేపర్ లీకేజ్ పట్ల విద్యార్థులకు అంగీభవం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నర్సంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ కూడలి వద్ద నిరసన చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పెండెం రామానంద్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడిందని ఆరోపించారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని



డిమాండ్ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలు సహించరని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీలో లాఠీచార్జి, రబ్బరు తూటాల ప్రయోగం జరపడం దుర్మార్గమని విమర్శించారు. విద్యార్థులకు అండగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల సాంబరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, మాజీ ఎంపీటీసీ కాటా ప్రభాకర్, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, కుమారస్వామి,కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్....
- విద్యార్థుల పై లాఠీ ఛార్జీ నిరసిస్తూ..మోడీ దిష్టి బొమ్మ దగ్ధం..

**నర్సంపేట, నేటిధాత్రి:** ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీ ఛార్జీ చేయడం నిరసిస్తూ పెట్టిన కేసులు ఎత్తివేయాలని నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలి వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారుంఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ మాట్లాడుతూ, నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు



తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకతను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యలపై నిన్న ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులను అరెస్టు చేయడం,లాఠీలతో రక్తం వచ్చే విధంగా కొట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి వారిని వేధించడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత కొద్దిరోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, ప్రజా ఉద్యమాలను అణచివేయకుండా సమస్యలను పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప సతీష్ , కందికొండ రాజు, బుర్రీ ఆంజనేయులు కలకోట అనిల్, వజ్జంతీ విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరీ నాగమణి, లక్క రాజు, ఉదయగిరి సరిత, లక్ష్మి యాక లక్ష్మీ, జగన్నాథం కార్తిక్, విలియం కెరీ , దాసరి నరేశ్, శివ, నరేష్, సాయి రాజా, మహేశ్, ప్రభు, దుర్గ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలో ప్రత్యేకంగా ప్రజలకు రైతులకు అవగాహన సదస్సు..

**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం గండి లచ్చపేట గ్రామంలో. ప్రభుత్వ అధికారులచే ప్రత్యేక గ్రామసభ నిర్వహించి పలు విషయాలపైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా. ఇూా. మేడం జయశీల. మాట్లాడుతూ. ఎల్నినో. పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తూ. రైతులు వర్షాలకు అనుకూలంగా పంటలు వేయాలని. వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడకూడదని. అలాగే. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని. ప్రతి పొలానికి పంట కుంట. ప్రతి ఊరికి ఊరకుంట. నిర్మించుకోవాలని దీనివలన భూగర్భ జలాలు అడుగు అంటకుండా పైకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని. నీరు లేనియెడల రైతులు నష్టపోతారని. మనకు ముందస్తుగా ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాయని వీటిని ప్రజలు సద్వినియోగం



చేసుకోవాలని అలాగే. వీటికి కూడా ప్రభుత్వం పరంగా కూడా కొంత ఆర్థిక సాయం అందిస్తూ ఉందని. ముఖ్యంగా నీటి నిల్వలు కాపాడుకునే విధంగా ప్రతి ఒక్కరు ముందు ఉండాలని. ముఖ్యంగా రైతులు పంటల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని. ఈ సందర్భంగా తెలియజేస్తూ. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేస్తూ. పిల్లల బాగోబాగులు తెలుసుకొని. ఉపాధ్యాయులు సకాలంలో వస్తున్నారా మధ్యాహ్న భోజనం సరిగా పెడుతున్నారా లేదా పలు సమస్యలపై విద్యార్థులతో చర్చించి వాటిపై పలు సూచనలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో. ఇూా. జయశీల. వీ=ూ. మురళీకృష్ణ. వీూా. మిర్జా.-ూా. సంజీవ్. ఇరిగేషన్. -ూజు. సాగర్.-ూూా. రాజా నరసయ్య. సర్పంచ్ అంజయ్య. ఉప సర్పంచ్ భాను. రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# కేటీఆర్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వెంకట్ నారాయణ గౌడ్

- పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు.. ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష....

**నర్సంపేట, నేటిధాత్రి:** బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని నర్సంపేట పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నాగెల్లి వెంకట్ నారాయణ గౌడ్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ నారాయణ గౌడ్



కేటీఆర్‌కు పూల మొక్కను బహూకరించి, ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు, పారిశ్రామిక రంగ ప్రోత్సాహానికి కేటీఆర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, కేటీఆర్ నాయకత్వంలో పార్టీ ప్రజలకు మరింత చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై నర్సంపేటలో విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం




## వరంగల్ కూడలిలో రాస్తారోకో.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాకు డిమాండ్....

**నర్సంపేట, నేటిధాత్రి:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నర్సంపేటలో వామపక్ష విద్యార్థి సంఘాలు, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టాయి. వరంగల్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు జయ్యారపు అఖిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, పీడీఎస్‌యూ నాయకుడు అజయ్ నరేష్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిందని ఆరోపించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను అమలు చేయాలని కోరారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు మద్దతుగా వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. "ధర్మాన్ని కాపాడండి.. ధర్మేంద్ర ప్రధాన్‌ను కాదు" అంటూ నిరసన వ్యక్తం చేసిన నాయకులు, నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు



**గుండాల, నేటిధాత్రి:** గుండాల మండల కేంద్రంలో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుండాల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తెల్లం భాస్కర్, పార్టీ సీనియర్ నాయకులు గడ్డం వీరన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు సూచనతో మండల కేంద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించామని అన్నారు. ప్రతి సంవత్సరం జన్మదిన వేడుకలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి టి రాము, యువజన విభాగం అధ్యక్షులు సయ్యద్ అజ్జు, ఎస్టీ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు జాడి ప్రభాకర్, తాటి కృష్ణ,పొంబోయిన సుధాకర్,బొమ్మెర్ల శ్రీను, గోగ్గల రమేష్, బొమ్మెర్ల పద్మారావు, బొమ్మెర్ల సతీష్, గాంధర్ల కిరణ్, గుగులోతు కాలు, జి రాంబాబు, బొమ్మెర కృష్ణ, గుగులోతు వీరు, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నేతలు



▶▶కాంగ్రెస్ దేశద్రోహ శక్తులను సమర్థిస్తోందని ఆరోపణ...

▶▶భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి...

**నర్సంపేట, నేటిధాత్రి:** దేశ వ్యతిరేక శక్తులను సమర్థిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరికి నిరసనగా నర్సంపేట నియోజకవర్గంలోని వరంగల్ రోడ్ సర్కిల్ వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులకు కాంగ్రెస్ పార్టీ పదేపదే మద్దతు ఇవ్వడం దురదృష్టకరమని ఆరోపించారు. దేశద్రోహ భావజాలాన్ని ప్రోత్సహించే వారిని సమర్థించడం కాంగ్రెస్ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. నీట్ జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష అంశాన్ని కూడా కాంగ్రెస్ రాజకీయాలకు ఉపయోగించుకుంటోందని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకుండా, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చించాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. దేశ సమగ్రత, జాతీయ భద్రత, రాజ్యాంగ పరిరక్షణ విషయంలో భారతీయ జనతా పార్టీ ఎలాంటి రాజీ పడదని, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా,మండల నాయకులు పాల్గొన్నారు.

# NSUI, USFI, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

## విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడటం మానుకోవాలి -- విద్యార్థి సంఘాల హెచ్చరిక




**జఫర్‌గఢ్, నేటిధాత్రి:** NSUI USFI యూత్ కాంగ్రెస్ విద్యార్థి సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపు మేరకు జఫర్‌గఢ్ మండల కేంద్రంలో బంద్ విజయవంతంగా జరిగింది మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు జూనియర్ కళాశాలలు ఇతర విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలుపుతూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా NSUI మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్, USFI జిల్లా కార్యదర్శి యాకన్న రాథోడ్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటికాయల రాజేందర్,ఎ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిళిపాక ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ దేశంలో పరీక్షల నిర్వహణలో వరుసగా చోటుచేసుకుంటున్న అవకతవకలు, పేపర్ లీకులు అక్రమాలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని నిలబెట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం సాంకేతిక భద్రత ఉండేలా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఇటీవల ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు ప్రజాస్వామ్యంలో విద్యార్థులకు తమ సమస్యలను వ్యక్తపరిచే హక్కు ఉందని, ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీక్ ఘటనల వల్ల విద్యార్థులు వారి కుటుంబాలు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని పేర్కొంటూ ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి నష్టపరిహారం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారుఅలాగే పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన లినేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ను రద్దు చేసి, పారదర్శకమైన కొత్త పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితులకు రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు దేశవ్యాప్తంగా



విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన ప్రభుత్వ వైఫల్యాలకు బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు అదేవిధంగా VBSA బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని, విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధమైన ఎలాంటి చట్టాలు విధానాలను విద్యార్థి సమాజం అంగీకరించబోదని స్పష్టం చేశారు విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించాలని ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం కూడా స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి గృహాలు మౌలిక సదుపాయాల వంటి విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు మండలంలోని విద్యార్థులు అధ్యాపకులు ప్రజాస్వామ్యవాదులు సామాజిక సంఘాలు యువజన సంఘాలు బంద్‌కు మద్దతు తెలిపినందుకు NSUI USFI యూత్ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల హక్కుల సాధన కోసం మరింత ఉధృతమైన ప్రజాస్వామ్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ప్రధాన డిమాండ్లు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై నిష్పక్షపాత పారదర్శక విచారణ జరపాలి నీట్ పేపర్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం అందించాలి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)ను రద్దు చేయాలి VBSA బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలి పారదర్శకమైన విశ్వసనీయమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలి విద్యా రంగాన్ని బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలిఈ కార్యక్రమంలో USFI జిల్లా నాయకులు అర్జున్, మండల నాయకులు బన్నీ, రాజేష్, హర్షిత, జేస్వంత్, NSUI, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది... విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణే మా లక్ష్యం

# తెలంగాణ జలసిరి పోస్టర్ల ఆవిష్కరణ ప్రతి నీటి చుక్కను సంరక్షించాలని అధికారుల పిలుపు

▶▶జైపూర్ మండలంలో విస్తృత ప్రచారానికి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు....



**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం తెలంగాణ జలసిరి అవగాహన వాల్ పోస్టర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి. సత్యనారాయణ గౌడ్,మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) శ్రీపతి బాపురావు ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను సంరక్షించడం అత్యంత అవసరమని అన్నారు. ఇంకుడు గుంతలు,ఫామ్ పాండ్ల ఏర్పాటు ద్వారా భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, అలాగే ఊట కుంటలు,బోరు బావుల రీఛార్జ్ చర్యలతో వర్షపు నీరు వృథా కాకుండా నేరుగా భూమిలోకి చేరి బోరుబావులు, చేతి పంపుల్లో నీటిమట్టం పెరగడానికి దోహదపడుతుందని వివరించారు. తెలంగాణ జలసిరి వాల్ పోస్టర్లను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రధాన కూడళ్లలో,గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బాలయ్య,జైపూర్ గ్రామ సర్పంచ్ కూన భాస్కర్,పంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్,మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది ఇంద్రావతి,తిరుపతి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్ అవగాహన సదస్సు

▶▶మహిళల భద్రత, సైబర్ నేరాలపై విద్యార్థులకు సూచనలు...



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని సర్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్ ఎస్సై స్వాతి ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై స్వాతి మాట్లాడుతూ, విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించడంతో పాటు సమాజంలో జరుగుతున్న నేరాలు, ముఖ్యంగా మహిళలపై వేధింపులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని తెలిపారు. విద్యార్థినులు ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే షీ టీమ్, పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అత్యవసర సేవలు, ఫిర్యాదు విధానాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై కూడా విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ తిరుపతి, మౌలాల్, మహిళా కానిస్టేబుల్ నాగభవ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలప్పుడే కేటీఆర్‌కు వార్డులు గుర్తుకొస్తాయా



సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు...

**సిరిసిల్ల, నేటిధాత్రి:** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ నాయకుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఇప్పుడు వార్డులు గుర్తుకొస్తున్నాయా అని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని 29, 30, 32వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్డు కమిటీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వారంలో రెండు రోజులు సిరిసిల్లలో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారని,



అయితే ఆ హామీని అమలు చేయకుండా హైదరాబాద్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. సిరిసిల్ల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధి అవసరమని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే స్థానిక నాయకత్వానికే రానున్న ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలో దాదాపు లక్ష మంది ఓటర్లు ఉన్నారని, స్థానిక పరిస్థితులు తెలిసిన నాయకుడినే ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభ్యుడిగా గెలిచి హైదరాబాద్‌లో ఉండే నాయకుడు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడతారో ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ కూరపాటి శ్రీశైలం, బూట్ల నవీన్, భీమవరం శ్రీనివాస్, దుంపేటి రాకేష్, బచ్చు ప్రసాద్, గజ్జెల అశోక్, గుడిసేటి బాలరాజు, సదుల గంగరాజు, మోర ప్రసాద్, కైరంకొండ రాహుల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరిసిల్లలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

▶▶మానవాకార ఉపాధ్యాయ యంత్రం(రోబో) ఆవిష్కరణ....

▶▶ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బాలింతలకు కేసీఆర్ కిట్ల పంపిణీ....

▶▶బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం...

▶▶రాజీవ్‌నగర్ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ....



**సిరిసిల్ల, నేటిధాత్రి:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ



ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గీతానగర్ పాఠశాలలో మానవాకార ఉపాధ్యాయ యంత్రం(రోబో) ఆవిష్కరణ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణలోనే తొలి మానవాకార ఉపాధ్యాయ యంత్రాన్ని (రోబో) ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ రాష్ట్ర సహకార బ్యాంకుల సమాఖ్య (నాఫ్‌స్కాబ్) చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి, ఇండస్ హ్యూమనాయిడ్ ల్యాబ్ ప్రతినిధులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు, కో-





ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బాలింతలకు కేసీఆర్ కిట్ల పంపిణీ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అలాగే బాలింతలకు కేసీఆర్ కిట్లతో పాటు పండ్లు, బ్రెడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది ఆవునూరి రమాకాంత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల రాజీవ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ విప్ బుర్ర మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బుర్ర లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు మండల భూపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఝరాసంగం మండల "బిఎల్ఏ" ఎస్, తో (ఎస్ఐఆర్ ) సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన

▶▶మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇన్‌చార్జ్ డా॥ఏ. చంద్రశేఖర్....

▶▶జహీరాబాద్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్....

▶▶మాజీ ఇండస్ట్రియల్ ఛైర్మెన్ మొహమ్మద్ తన్వీర్.....



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఝరాసంగం మండలంలోని లింగాయత్ సత్రంలో మాజీ మంత్రివర్యులు,జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో "బిఎల్ఏ" ఎస్, మరియు పార్టీ నాయకులతో (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతి, ప్రతి బూత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణ, ఫారాల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం, పార్టీ శ్రేణుల సమన్వయంతో లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయడంపై డా॥ఏ.చంద్రశేఖర్ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి బిఎల్ఏ, పార్టీ నాయకుడు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సీడీసీ. ఛైర్మెన్ ముబీన్ ల,మాజీ ఇండస్ట్రియల్ ఛైర్మెన్ తన్వీర్, మండల అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ ,మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్,మాజీ పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు, కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్,యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డి, మండల నాయకులు, సర్పంచులు, "బిఎల్ఏ" ఎస్, పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కోదాడలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ. బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ మేదర లలిత...



**కోదాడ, నేటిధాత్రి:** బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను కోదాడ పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బి ఆర్ ఎస్ నాయకురాలు మాజీ కౌన్సిలర్ మేదర లలిత ఆధ్వర్యంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మేదర లలిత మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిత్యం పరితపించే కేటీఆర్ నాయకత్వం యువతకు పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ప్రజలకు సేవ చేసే శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆస్పత్రిలో రోగులను పలకరించి వారి ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకుని పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చీమ నరేష్ బాబు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాహుల్, సైదులు, వెంకీ, కర్ల నర్సయ్య, శంకర్, నాగరాజు, కార్యకర్తలు ఆసుపత్రి సిబ్బంది తదితరులు యువకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కాంగ్రెస్ ధర్నా.



▶▶కేంద్ర విద్యా శాఖ మంత్రి ని వెంటనే బర్తరఫ్ చేయాలి.

▶▶మండల పార్టీ అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్.

▶▶రాహుల్ గాంధీ అరెస్ట్ అమానుషం.

**నల్లబెల్లి, నేటిధాత్రి:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ అంశంపై పోరాడుతున్న లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ మండలంలోని రుద్రగూడెం జాతీయ రహదారిపై కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ధర్నాను ఉద్దేశించి చరణ్ సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తున్నారని అన్నారు. అలాంటి నాయకుడిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు విద్యార్థుల భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం అణిచివేయడం సిగ్గుచేటని విమర్శించారు. గత 12 ఏళ్ల బిజెపి పాలనలో వరుసగా ప్రశ్నాపత్రాల లీకులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామాలలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తి బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆయనను పదవి నుంచి తప్పించి నీట్ ప్రశ్నపత్రం లీకేజీ పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చార్ల శివారెడ్డి, మాలోతు రమేష్, పిఎసిఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు, రాజిరెడ్డి, జిల్లా మునీందర్, కుసుంబా రఘుపతి, బత్తిని మల్లయ్య, శివకోటి, చిట్యాల ఉపేందర్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పెన్నులు ప్యాడ్స్ నోట్ బుక్స్ పంపిణీ



**వనపర్తి, నేటిధాత్రి:** వాసవి క్లబ్ వనపర్తి గోల్డ్ వనితా క్లబ్ ఆధ్వర్యంలో జోన్ చైర్మన్ పర్యటించారని వనిత వాసవి క్లబ్ నిర్వహికులు తెలిపారు వనపర్తి జోన్ చైర్మన్ చిగుళ్లపల్లి శ్రీనివాసులు గారి చేతుల మీదుగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్‌లు, పెన్నులు నోట్‌బుక్‌లు పంపిణీ చేశామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిల్వర్ స్టార్ కేసీజీఎఫ్ న్యాయ వాది కొత్త రామకృష్ణ వాసవి క్లబ్ వనపర్తి గోల్డ్ అధ్యక్షులు ఆకుతోట రాఘవేందర్, కార్యదర్శి దాచా హరీష్ కుమార్, కోశాధికారి చిగుళ్లపల్లి కార్తీక్ పాల్గొన్నారు వనితా క్లబ్ తరపున అధ్యక్షురాలు కొంపల రజిత, కార్యదర్శి పాపిశెట్టి రాధిక కోశాధికారి కటకం ప్రశాంతి మరియు ఇతర వాసవి క్లబ్ సభ్యులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు నిరంజన్ య్యా విద్యార్థులు పాల్గొన్నారు ఈసందర్భంగా విదార్థులకు ఉచితంగా పెన్నులు ప్యాడ్స్ నోటు బుక్స్ పంపిణీ చేసిన శీ దుకు ఉపాధ్యాయులు వాసవి వనిత క్లబ్ వారిని అభినందించారు

# ప్రభుత్వ బడులు... పునర్వైభవమా? సవాళ్లతో పోరాటమా?

## ఆధునికీకరణతో కొత్త ఆశలు... తగ్గుతున్న చేరికలతో ఆందోళనలు




పరకాల,నేటిధాత్రి

ఉదయం 9 గంటలకు పాఠశాల ఆవరణలో విద్యార్థుల ప్రార్థనతో రోజు ప్రారంభమవుతోంది.చిన్నారుల కిలకిలరావాలు,తరగతి గదుల్లో వినిపిస్తున్న పాఠాలు,ఆటస్థలంలో సందడి చేస్తున్న విద్యార్థులను చూస్తే ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయనే భావన కలుగుతుంది.అయితే ఆ దృశ్యాల వెనుక మరో వాస్తవం కూడా కనిపిస్తోంది.ఒకవైపు ఆధునికీకరణ దిశగా అడుగులు పడుతుండగా,మరోవైపు విద్యార్థుల సంఖ్య తగ్గడం,ప్రైవేట్ పాఠశాలల ప్రభావం వంటి సవాళ్లు ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరీక్షిస్తున్నాయి.

### ఒకప్పుడు విద్యకు ప్రతీక...

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలే విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి.రైతులు,కూలీలు,చిన్న ఉద్యోగుల పిల్లలు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకునేవారు.ఆ కాలంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం పొందడం,అక్కడ చదవడం గౌరవంగా భావించేవారు.గ్రామాల సామాజిక,విద్యా అభివృద్ధిలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషించాయి.దేశంలో ఉన్నత స్థానాలకు చేరుకున్న అనేక మంది అధికారులు,వైద్యులు,ఇంజినీర్లు,శాస్త్రవేత్తలు తమ విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచే ప్రారంభించారు.అందుకే ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యాసంస్థలు మాత్రమే కాకుండా సమాజ నిర్మాణానికి పునాదులుగా నిలిచాయి.

### మారుతున్న రూపురేఖలు

కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటున్నాయి.పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించబడుతున్నాయి.స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు,డిజిటల్ బోధన,కంప్యూటర్ ల్యాబ్‌లు,ప్రొజెక్టర్లు,ఆంగ్ల మాధ్యమ బోధన వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి.విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు,యూనిఫాంలు,మధ్యాహ్న భోజనం,స్కాలర్‌షిప్‌లు,విద్యా సామగ్రి అందించడం ద్వారా విద్యను అందరికీ చేరువ చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.కొన్ని ప్రభుత్వ పాఠశాలలు విద్యా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నిలుస్తున్నాయి.

### ప్రైవేట్ పాఠశాలల ప్రభావం

అయితే విద్యా రంగంలో ప్రైవేట్ పాఠశాలల ప్రభావం రోజురోజుకు పెరుగుతోంది.ఆంగ్ల మాధ్యమం,ప్రత్యేక కోచింగ్,మెరుగైన ఫలితాలు అనే ప్రచారంతో ప్రైవేట్ సంస్థలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి.తమ పిల్లల భవిష్యత్తు కోసం అధిక ఫీజులు చెల్లించడానికైనా తల్లిదండ్రులు వెనుకాడటం లేదు.దీంతో అనేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండగా,గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రమంగా అదే పరిస్థితి ఏర్పడుతోంది.

### ఇంకా వెంటాడుతున్న సమస్యలు

ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ కొన్ని సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి.కొన్ని చోట్ల తాగునీరు,మరుగుదొడ్లు,ఆట స్థలాలు,భద్రతా గోడలు వంటి ప్రాథమిక సదుపాయాల కొరత కూడా కనిపిస్తోంది.కొన్ని గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో వాటి భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.పాఠశాలల విలీనం వంటి నిర్ణయాలు కూడా చర్చకు దారితీస్తున్నాయి.

### నాణ్యమైన విద్యే అసలు లక్ష్యం

విద్యా రంగంలో నిపుణులు చెబుతున్నదేమిటంటే,కేవలం భవనాలు నిర్మించడం ద్వారా విద్యా వ్యవస్థ బలోపేతం కాదని.నాణ్యమైన బోధన, ఉపాధ్యాయుల నియామకం,సాంకేతిక వనరుల వినియోగం,విద్యార్థుల నైపుణ్యాల పెంపుదలపై ప్రత్యేక దృష్టి అవసరమని భావిస్తున్నారు.ఇప్పటికే అనేక పాఠశాలల్లో క్రీడలు,సైన్స్ ఫెయిర్లు,సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు.విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను పెంపొందించేలా మారుతోంది.

### భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కీలక మలుపు వద్ద నిలిచాయి.ఒకవైపు ఆధునిక సదుపాయాలతో ముందుకు సాగుతుండగా,మరోవైపు ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.విద్యార్థుల చేరికలు పెరగడం,బోధన నాణ్యత మెరుగుపడడం,మౌలిక సదుపాయాలు సంపూర్ణంగా అందుబాటులోకి రావడం వంటి అంశాలు భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు బలపడితేనే సమాజంలో ప్రతి వర్గానికి సమాన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది.ఆ భవిష్యత్తును నిర్మించే బాధ్యతను ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటికీ సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాయి. మార్పు దిశగా అడుగులు వేస్తున్న ఈ విద్యా సంస్థలు సవాళ్లను అధిగమించి మరింత బలంగా నిలవగలవా అన్నది రానున్న రోజులు తేల్చనున్నాయి.



అంబేద్కర్ దొమ్మటి
పరకాల రిపోర్టర్

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

## గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహణ



వర్ధన్నపేట, నేటిధాత్రి:

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ మరింత బలోపేతం కావడానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, ఉప సర్పంచ్ మేకల దేవేందర్, బిర్రు చంద్రయ్య, తక్కలపల్లి వెంకటేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, బిర్రు రాజు, బాతు వెంకన్న, బిర్రు రవీందర్, మేకల రాములు, తంగెళ్ల భాస్కర్, గుంటి రవి, చాగంటి కుమారస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ములుగులో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

## 50 కేజీల కేక్ కటింగ్, రోగులకు పండ్ల పంపిణీ.



ములుగు, నేటిధాత్రి:

ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ములుగు మండల మాజీ పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని 50 కేజీల భారీ కేకును కట్ చేశారు.

కేక్ కటింగ్ అనంతరం నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలకు కేకును పంచిపెట్టారు. దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులకు, ఆసుపత్రి సిబ్బందికి పండ్లను పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

### నాయకుడు కేటీఆర్ సేవలు అమోఘం: సానికొమ్ము రమేష్ రెడ్డి

ఈ సందర్భంగా సానికొమ్ము రమేష్ రెడ్డి మాట్లాడుతూ... "గత పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ రంగంలో, హైదరాబాద్ నగరాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత కేటీఆర్ గారిదే. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ రైతులు, యువకులు మరియు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముందుండి పోరాడుతున్నారు." ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది సంబరాలకు దూరంగా ఉంటూ సేవా కార్యక్రమాల ద్వారానే జన్మదిన వేడుకలు జరపాలని పిలుపునిచ్చిన ఆదర్శవంతమైన నాయకుడు కేటీఆర్ అని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆర్ గొప్ప నాయకుడిగా ఎదగాలని, మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సేవా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు వేములపల్లి బిక్షపతి, కోళ్ల వేంకన్న, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఆకుతోట చంద్రమౌళి.బిఆర్ఎస్ ములుగు జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కోగిల మహేష్, మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయరాం నాయక్, మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, కౌన్సిలర్ కోగిల లక్ష్మి బైకాని ఓదెలు, పైడిమల్ల భాస్కర్, గండి కుమార్, భూక్య మురళి, గరిగే రఘు, మసిపెద్ది సత్యనారాయణ, కవ్వంపల్లి బాబు, ఆరిందుల కుమార్, రవీందర్, రాందాస్, దూడబోయిన శ్రీనివాస్, కోడిపాక మహేందర్, నాజర్ ఖాన్, పాడియా చంటి, పాడియా కార్తీక్, చిట్టి బాబు, లియాకత్ అలీ, మోరే రాజయ్య, అనుముల సురేష్, రాంబాబు, అఖిల్, గడ్డం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల సంస్కరణలపై సుప్రీం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారం అనంతరం పరీక్షల నిర్వహణలో చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను ధర్మాసనం ఆదేశించింది.

పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా పూర్తి వివరాలు సమర్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించింది.

పరీక్షలు ప్రారంభానికి ముందు, పరీక్షల సమయంలో, పరీక్షల అనంతరం చేపట్టిన సంస్కరణలపై ప్రత్యేక స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని వినియోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ స్పందిస్తూ.. అది తాత్కాలిక నివారణ చర్య మాత్రమేనని, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు.

భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్షల అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని రక్షించే డేటా భద్రతా చర్యలపై కూడా వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజీయాత్ర' వంటి ఆధునిక సాంకేతికతల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని సూచించింది. పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటుపై పురోగతిని నివేదికలో పొందుపరచాలని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. కోర్టు సూచించిన అన్ని అంశాలతో కూడిన తాజా సమగ్ర అఫిడవిట్‌ను త్వరలో దాఖలు చేస్తామని తెలిపారు. దీనికి ధర్మాసనం ఆమోదం తెలిపింది.

నీట్ వంటి అత్యంత కీలక జాతీయ పరీక్షల్లో సంస్కరణల అమలును కోర్టు నిరంతరం పర్యవేక్షిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

లోక్‌సభ, రాజ్యసభల్లో నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చర్చ జరపాలని ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. అనంతరం కూడా అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది.

మరోవైపు పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామని తెలిపారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

మరోవైపు.. విద్యార్థులపై జూలై 20న జరిగిన పోలీసు చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్ని కూడా పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్ లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు.

ఇదిలావుంటే, వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో లిలి'వందేమాతరం బిల్లు'లిలిను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్షతో పాటు ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలను కూడా ఇందులో పొందుపరిచారు.

అయితే ఈ బిల్లుపై విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రాజ్యసభ కార్యకలాపాలను సభాపతి సోమవారానికి వాయిదా వేశారు.

# ఓట్ల తొలగింపునకు బీజేపీ కుట్ర!

## దళితులు, గిరిజనుల ఓట్లే లక్ష్యమని డా. పెరుమాండ్ల రామకృష్ణ ఆరోపణ



### ఓటు హక్కును కాపాడటం ప్రతి అధికారికీ రాజ్యాంగబద్ధ బాధ్యత అర్హులందరూ పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపు

హనుమకొండ, నేటిధాత్రి:

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీ ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బడుగు, బలహీన వర్గాల ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆరోపించారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ 60వ డివిజన్‌లో నిర్వహించిన ఓటరు నమోదు, సవరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

స్వాతంత్ర్యం తర్వాత దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కీలకంగా పనిచేసిందని, అందువల్ల ఈ వర్గాలు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తున్నాయని అన్నారు. అదే కారణంతో ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం కోసం వారి ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.



ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, కొత్త ఓటర్లు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితాలోని తప్పులను సరిచేసుకోవాలని సూచించారు. చిరునామా మారిన వారు, మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం నవీకరించాలని కోరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్న ఆయన, అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి తిప్పికొడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, 60వ డివిజన్ అధ్యక్షులు పున్నం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- విద్యార్థులపై నమోదైన కేసులు ఎత్తివేయాలని సీజేపీ డిమాండ్

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు శుక్రవారం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సమావేశమయ్యారు. నీట్ సహా విద్యా వ్యవస్థకు సంబంధించిన కీలక అంశాలపై దాదాపు రెండు గంటలపాటు చర్చలు జరిగాయి.

తమ మూడు ప్రధాన డిమాండ్లను సీజేపీ ప్రతినిధులు లిఖితపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు స్పష్టం చేశారు. పేపర్ లీక్ వ్యవహారం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, పార్లమెంట్‌కు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై స్పందించిన



కేంద్ర మంత్రులు నిర్ణయం తీసుకునేందుకు ఒక రోజు గడువు ఇవ్వాలని కోరారు. దీంతో శనివారం మరోసారి సమావేశం కావాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్.. కేంద్రం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచామని తెలిపారు. వాటిలో రెండు అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయడానికి కేంద్రం అంగీకరించిందని, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపిందన్నారు. అయితే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం తీసుకోవడానికి రేపు మధ్యాహ్నం వరకు సమయం కోరిందని వెల్లడించారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ హాజరుకాగా.. సీజేపీ తరఫున జాతీయ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తప్ప మరేదీ ఆమోదయోగ్యం కాదని సీజేపీ స్పష్టం చేసింది. తమ డిమాండ్ నెరవేరకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ప్రధాన్ పదవి నుంచి వైదొలిగే వరకు నిరసనలు కొనసాగిస్తామని పునరుద్ఘాటించింది.

# బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలి : సీపీ అంబర్ కిశోర్ ఝా




తాండూర్, నేటిధాత్రి:

బాధితుల ఫిర్యాదుపై వేగంగా స్పందించి పారదర్శక విచారణ ద్వారా సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ తో కలిసి శుక్రవారం తనిఖీ నిర్వహించారు. కార్యాలయ పనితీరు, రికార్డుల నిర్వహణ, పోలీసు సేవల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఆఫీస్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను పాటిస్తూ ప్రజలకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్ కు వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా, ఓర్పుతో వ్యవహరించి వారి సమస్యలను వినాలని అన్నారు. క్రింది స్థాయి అధికారులకు కూడా ప్రజలకు సకాలంలో సహాయం అందించేలా మార్గనిర్దేశం చేయాలని చెప్పారు. స్థానిక రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు తమ సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ దేవయ్య, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# కట్ట మైసమ్మకు బోనాలతో బాధితుల మొర

- కట్టిన పైసలు వడ్డీతో సహా ఇప్పించాలంటూ ప్రత్యేక పూజలు
- అక్షోభ్యా చిట్స్ యాజమాన్యంపై బాధితుల ఆగ్రహం




డెస్క్, నేటిధాత్రి:

అక్షోభ్యా చిట్స్‌లో కట్టిన సొమ్ము వడ్డీతో సహా తిరిగి రావాలని కోరుతూ శాంతినగర్ కట్ట మైసమ్మ తల్లికి బాధితులు బోనాలు సమర్పించారు. డప్పులు, బ్యానర్లు, కరపత్రాలు, మైకులతో భారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారిని ప్రార్థించారు.

గత 50 నెలలుగా చెమటోడ్చి నెలనెలా చెల్లించిన సొమ్మును చిట్స్ యాజమాన్యం తిరిగి ఇవ్వకుండా ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టేస్తున్నారని బాధితులు ఆరోపించారు. కంపెనీ పేరుతో ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి ఇప్పుడు చేతులెత్తేస్తున్నారని మండిపడ్డారు.

యాజమాన్యం వెంటనే బాధితులకు బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని, లేదంటే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కష్టపడి సంపాదించిన సొమ్ము తిరిగి వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

స్థానికులు కూడా బాధితులకు మద్దతు తెలుపుతూ, యాజమాన్యం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999